క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజుపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాలలో నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాటుతుందని విద్యుత్ ఏఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

సత్తెనపల్లి: పట్టణంలో 11 కేవీ లైన్‌లో ట్రీ కటింగ్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం తెలిపారు. ఏదైనా విద్యుత్‌కు సంబంధించిన సమస్యలకు సత్తెనపల్లి టౌన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబరు 9494116238 కు ఫోన్ చేయాలన్నారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని మెయిన్ రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిజ శ్రావణ మాస శుక్రవారంను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక కైకర్యం అనంతర అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లలితా సహస్రనామ పారాయణం



పెదకూరపాడు: లలితా సహస్రనామ పారాయణతో లోక కల్యాణం జరుగుతుందని, పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటారని ఆధ్యాత్మిక గురువులు తెలిపారు. మండలంలోని 75త్యాళూరులోగల అవధూత అయోధ్య స్వామి ఆశ్రమంలో శుక్రవారం 5లక్షల లలితా సహస్రనామ పారాయణ కార్యక్రమాన్ని చేపట్టారు. మేడికొండూరుకు చెందిన శ్రీసతారామాంజనేయ భక్త సమాజం, పేరేచర్ల, సిరిపురం, పాడపాడు గ్రామాల భక్తసమాజం వారు ఈ పారాయణ మహోత్సవాలలో పాల్గొన్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఉత్సవ నిర్వహకులు తాటి రామకృష్ణ, కోటేశ్వరమ్మ, గోపీ తదితరులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం చేపట్టారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

సత్తెనపల్లి టౌన్ సీఐగా ప్రభాకరరావు



సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణ సీఐగా పొన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పి.ప్రభాకర్‌ను నియమించారు. ఈ మేరకు గుంటూరు రేంజ్ సౌత్ కోస్టల్ జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా ఉన్న యు.శోభన్‌బాబును గుంటూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. ప్రభాకర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

కేజీబీవీలో ఎంఈఓ తనిఖీలు

మెనూ ప్రకారం భోజనం అందించడం లేదంటూ విద్యార్థినుల ఫిర్యాదు



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): విద్యార్థినులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం శుచిగా ఆహారాన్ని అందించాలని ఎంఈఓ ఒంగోలు రాజు చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు లోని కేజీబీవీ పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న మెనూ వివరాలను పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విజయకుమారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతోను మాట్లాడి వారి నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. పాఠశాలలో మూడు రోజుల నుంచి మెనూ ప్రకారం ఆహారం అందించటం లేదని గుర్తించారు. గుడ్డు కూడా అందించటం లేదని, ఆహారం కూడా రుచిగా ఉండటం లేదని విద్యార్థినులు ఎంఈఓ దృష్టికి తెచ్చారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన మేర ఆహారాన్ని అందించాల్సిందేనని ఉపాధ్యాయులకు సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలని, విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేయరాదని చెప్పారు.

సామరస్య పరిష్కారం.. సత్వర న్యాయం

- నేడు జాతీయ మెగా లోక్ అదాలత్
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రెండు మెగాలోక్ అదాలత్‌లు
- సత్తెనపల్లి ఏరియా పరిధిలో 1,027 కేసులు పరిష్కారం



సత్తెనపల్లి కోర్టు వద్ద కక్షిదారులు

సత్తెనపల్లి: చిన్నచిన్న కేసులతో సుదీర్ఘకాలం కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకునే కక్షిదారులకు అండగా ఉండేందుకు .. సత్వర న్యాయం అందించే లక్ష్యంతో మెగా జాతీయ లోక్ అదాలత్‌కు సుప్రీంకోర్టు శ్రీకారం చుట్టింది. ఇరువురు కక్షిదారులతో.. చర్చించి సామరస్యంగా సమస్య పరిష్కరించే ఈ ప్రక్రియ ద్వారా ఇటు కక్షిదారులకు ఊరట లభించటంతో పాటు అటు పోలీసు, న్యాయ శాఖలపై కేసుల భారం తగ్గుతుంది. ప్రస్తుతం సత్తెనపల్లిలో శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు పోలీసు, న్యాయ శాఖలు సన్నద్ధమవుతున్నాయి. ఇటీవల సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార కమిటీ చైర్‌పర్సన్ డి.నాగవెంకటలక్ష్మి పోలీసు అధికారులతో సమావేశమై కేసుల పరిష్కారానికి సంబంధించి పలు సూచనలిచ్చారు.రాజీకి సుముఖంగా ఉండే కాంపౌండబుల్ కేసుల్లోని కక్షిదారుల కేసులు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. సీఐ, ఎస్‌ఐలతో పాటు ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లకు పలు కేసులు బాధ్యతలు అప్పగించారు. ఎక్కువ కేసులు పరిష్కరించాలని సత్తెనపల్లి సబ్ డివిజన్ పోలీసులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిసింది.

కేసులు పరిష్కరించుకోవాలంటే ..

- పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులు పరిష్కరించుకోవాలనుకున్న కక్షిదారులు సంబంధిత పోలీసు స్టేషన్ అధికారిని సంప్రదించవచ్చు. కోర్టులో ఉన్నట్లయితే న్యాయవాది ద్వారా ప్రతిపాదనలతో న్యాయమూర్తిని ఆశ్రయించాల్సి ఉంటుంది. విచారించిన తర్వాత ఇరువురి సమ్మతితో న్యాయమూర్తి కేసును పరిష్కరిస్తారు.
- రహదారి ప్రమాదాలు, భూవివాదాలు, చెక్‌బౌన్స్, బ్యాంకులకు సంబంధించి రికవరీ, నష్ట పరిహారం, అప్పు వివాదాలు, బీమా సంస్థలతో వ్యవహారాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులు, చిన్నచిన్న గొడవలు, రాజీకి అర్హమైన క్రిమినల్ కేసులు పరిష్క రించుకోవచ్చు.

1,027 మందికి ఊరట..

ప్రతి మూడు నెలలకోసారి జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తారు. ఈ ఏడాది గడిచిన 8 నెలల్లో రెండుసార్లు జరిగాయి. సత్తెనపల్లిలోని నాలుగు న్యాయస్థానాల పరిధిలోని 11 మండలాలకు సంబంధించిన సివిల్, తొమ్మిది మండలాలకు సంబంధించిన క్రిమినల్ కేసులకు ఫిబ్రవరి 11న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 661 కేసులు పరిష్కారం కాగా రూ.65,25,783 నగదు చేతులు మారింది. అలాగే మే 13వ తేదీన 366 కేసులు పరిష్కారం కాగా రూ.85,05,743 నగదు చేతులు మారింది.

దొడ్లేరును మోడల్ విలేజ్‌గా మారుస్తాం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఆర్బీకే భవనాలు ప్రారంభం, బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామాన్ని ఆదర్శగ్రామంగా మారుస్తానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు హాజరైన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. దొడ్లేరు అంటే తనకు ప్రత్యేక అభిమానమని అన్నారు. గత ఎన్నికల్లో తనకు అత్యధిక మెజార్టీ ఇచ్చిన గ్రామం దొడ్లేరు అని గుర్తు చేశారు. మీకోసం- మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా పర్యటించినప్పుడు గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ఎన్నో సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. వెంటనే ఆ కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం చేపట్టామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా దొడ్లేరు గ్రామానికి అత్యధిక నిధులు కేటాయించినట్లు చెప్పారు. రూ.6 కోట్లతో పాఠశాలల అభివృద్ధి, రూ.2.5 కోట్లతో జల జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ కుళాయి, రూ.2.5 కోట్లతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, రూ.43 కోట్లతో సంక్షేమం, రూ.22 కోట్లతో అభివృద్ధి చేపట్టటం జరిగిందన్నారు. అమరావతి-బెల్లంకొండ డబుల్‌రోడ్డు పూర్తిఅయితే దొడ్లేరు మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంతటి ఆదరణ చూపిస్తున్న దొడ్లేరు గ్రామ ప్రజలకు తాను రుణపడి ఉన్నానన్నారు. భవిష్యత్తులో పులిచింతల బ్యాక్ వాటర్ ద్వారా దొడ్లేరులో సాగు నీటికి లోటులేకుండా చేస్తామన్నారు. తొలుత గ్రామంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం భవనాలు ప్రారంభించారు. అదేవిధంగా బీసీ కాలనీలో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. ఈకార్యక్రమంలో ఏడీఏ వి.హనుమంతరావు, దొడ్లేరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సాద్, ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శాంసన్, ఎంఎల్‌పీహెచ్ భూలక్ష్మి, ఏఎన్ఎం కోటేశ్వరి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పల్లెప్రోలు వెంకటేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి, ఆవుల అంకిరెడ్డి, మర్రి శ్రీనివాసరెడ్డి, మర్రి కోటిరెడ్డి, సోము మస్తాన్‌రెడ్డి, సయ్యద్ సైదా, సయ్యద్ అబ్దుల్ రహీం, మార్కాపురం కృష్ణ, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి, గంజినబోయిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మిరప సాగుపై అవగాహన తప్పనిసరి

సత్తెనపల్లి: మిరప సాగు పట్ల రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని ఉద్యాన శాఖ అధికారిణి సిహెచ్ జనని అన్నారు సత్తెనపల్లి మండలం కట్టమూరు, గోరంట్ల గ్రామాల్లో మిరప పంటపై రైతులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉద్యాన శాఖ అధికారిణి మాట్లాడుతూ మిరప పంటలో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతి రైతు తెలుసుకోవాలన్నారు. మిరప నారు తప్పకుండా శుద్ధిచేసి నాటుకోవాలన్నారు. ముందుగా తెగుళ్ల మందులో, ఆ తరువాత పురుగు మందులో విడివిడిగా ముంచి నాటుకోవాలని తెలిపారు. ఇలా చేయడం వలన వేరుకుళ్లు, వేరు పురుగు అరికట్టవచ్చునన్నారు. ప్రస్తుతం నాటిన మిరప నారు వర్షాలకి దెబ్బ తినకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఫిజియోథెరపీతో నొప్పులు మాయం

- ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామకృష్ణ
- ఘనంగా ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం




సత్కారం అందుకున్న ఫిజియోథెరపిస్టులు జీవన్‌జ్యోతి, కరుణాకర్‌లతో కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: ఫిజియోథెరపీతో నొప్పులు మటుమాయమవుతాయని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా వైద్యశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రమాద బాధితులు, శారీరక కదలికలు స్తంభించిన వారు, ఆపరేషన్లు చేయించుకున్న రోగులకు మునుపటి స్థాయి శారీరక పనితీరుకు ఫిజియోథెరపీ తప్పక అవసరం అన్నారు. కొద్ది రోజులకే తమ పనులు తాము చేసుకునే స్థాయికి తీసుకురావడంలో ఈ చికిత్స ఉపయోగంగా నిలుస్తుందన్నారు. ఫిజియోథెరపీ ద్వారా ఇక్కడ చికిత్స పొందిన వారు ఎంతో మంది తమ బాధల నుంచి విముక్తి పొందారన్నారు. ముఖ్యంగా పేదలకు, పక్షవాతం వచ్చిన రోగులకు ఏరియా వైద్యశాల ఒక వరంలాగా ఉందని కొనియాడారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ శరీరాన్ని ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచడంలో ఫిజియో థెరపిస్టులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారన్నారు. ఏరియా వైద్యశాలలో కేక్ కట్ చేసి ఫిజియోథెరపిస్టులు జీవనజ్యోతి, కరుణాకర్‌లను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఆర్ఎంఓ శోభారాణి, గైనకాలజిస్ట్ సుజాత, ఏఓ భవాని, ఆర్థోపెడిక్ వైద్యుడు ప్రవీణ్, జనరల్ సర్జన్ డాక్టర్ సుష్మ, అడ్మినిస్ట్రేటర్ సురేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధా, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రుల సహకారం అభినందనీయం

మార్కెట్‌యార్డు చైర్మన్ సాంబిరెడ్డి



విద్యాబోధన పరికరాలను ప్రారంభిస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్ సాంబిరెడ్డి

పెదకూరపాడు: అమెరికాలో స్థిరపడిన ప్రవాసాంధ్రులు తమ గ్రామంలోని పాఠశాలలో మెరుగైన విద్యనందించేందుకు రూ.25వేలు విలువచేసే భోదనభ్యాసన పరికరాలను పంపడం అభినందనీయమని మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అన్నారు. మండలంలోని 75 త్యాళ్లూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బోధనాభ్యాసన పరికర ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికోసం వేల కోట్ల రూపాయలతో వినూత్న మార్పులు చేపట్టిందన్నారు. నాడు-నేడు ద్వారా నూతన భవనాలు, అదనపు తరగతి గదులు, విద్యాబోధనలో మార్పులు, మధ్యాహ్న భోజనంలో పోషక విలువలతో కూడా ఆహారాన్ని విద్యార్థులకు పంపిణీ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. వీటితో పాటు అమెరికాలో స్థిరపడిన గోరంట్ల గ్రామానికి చెందిన వాసుబాబు విద్యాభివృద్ధికి కృషిచేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంఈఓ వై.ప్రసాదరావు, హెచ్ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుత్తికుండ శ్రీనివాసరెడ్డి, కల్లి శ్రీనివాసరెడ్డి, వంగా శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పరిశుద్ధ కుమారి, ఎంపీటీసీ అల్లం భవాని తదితరులు పాల్గొన్నారు.

విద్యతో అందరి జీవితాల్లో వెలుగు

నకరికల్లు: సంపూర్ణ అక్షరాస్యత సాధనకు ప్రభుత్వంతో పాటు ఎన్‌జీఓలు, స్వచ్ఛంద సంస్థలు కలసిరావాలని హెచ్ఎం షేక్ పాహిం కోరారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని చేజర్ల గ్రామంలోని ఎస్‌వీఎస్ ఆర్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అక్షరాస్యతే అభివృద్ధి, విద్య నేర్చుకో-విలువ పెంచుకో, చదువుకున్న బాలిక-దేశానికి ఏలిక అంటూ వీధుల్లో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను తల్లిదండ్రులు, ప్రజలు గుర్తించాలన్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. ఉపాధ్యాయులు ఎస్.లలిత, చెరుకూరు వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, గేరా మోహనరావు, ఏసీహెచ్‌వెంకట్రావు, బత్తుల సుందరరావు, షేక్ గౌస్ పాల్గొన్నారు.

వైభవంగా కోదండరామస్వామి ఆలయ భూమిపూజ



దేవాలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: మండలంలోని రోకటిగుంటవారి పాలెం గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ వారి సహకారంతో రూ.10లక్షల అంచనా వ్యయంతో నిర్మించే కోదండరామాలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య భూమిపూజా కార్యక్రమాలు అట్టహాసంగా జరిగాయి. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆయనతోపాటు ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ నక్కా శ్రీను, రామకృష్ణ, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, పార్టీ జిల్లా బీసీ సెల్ కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, సందెపోగు లక్ష్మణబాబు, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో సీజన్‌కు సరిపడా ఎరువులు



త్రిపురాపురంలో పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ కె.దేవదాసు

నకరికల్లు: ప్రస్తుత సీజన్‌కు సరిపడా అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని నర్సింగపాడు, త్రిపురాపురం గ్రామాల్లో సాగులో ఉన్న పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధరకాల పంటలు సాగుచేస్తున్న రైతులు ఈనెల 15వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ తరపున సంక్షేమ పథకాలు పొందాలంటే ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఏఓ కె.దేవదాసు, వీఆర్వో మార్కు, గ్రామ వ్యవసాయ సహాయకులు అహ్మద్, నవాజ్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ నీటితో పండే పంటలతో అధిక లాభాలు ..

నకరికల్లు: వరికి ప్రత్యామ్నాయ పంటలుగా కంది, మినుము, పెసర, శనగ సాగుచేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలస్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం శుక్రవారం నకరికల్లులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలను సాగుచేయడం ద్వారా తక్కువ నీటితో ఎక్కువపంటలు సాగు చేయవచ్చని సూచించారు. కందిలో ఎల్ఆర్‌జీ 105, ఎల్ఆర్‌జీ 52, పీఆర్‌జీ 176 రకాలు, మినుములో టీబీజీ 104, ఎల్‌బీజీ 884, ఏబీజీ 904, పీయూ-31 రకాలను సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15లోగా సాగుచేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, వ్యవసాయ సలహామండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాద బీమాపై అవగాహన

నకరికల్లు: ప్రమాద బీమా బాధిత కుటుంబాలకు వరం లాంటిదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని కండ్లకుంట గ్రామంలో సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులలకు ప్రమాదబీమా పథకంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం వైఎస్సార్ బీమాకు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బాధిత కుటుంబానికి సత్వరమే లబ్ధిచేకూరేలా వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని సూచించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ కంఠమనేని రామచంద్రరావు, కంఠమేని కోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



అమరావతి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మరణించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం సత్తెనపల్లి రోడ్డులో సుమారు 45 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఐదు రోజులుగా తానున్న ప్రాంతం నుంచి కదలలేని స్థితిలో ఉండడంతో చుట్టుపక్కల వారు గురువారం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం వ్యక్తి మరణించాడు మరణించిన వ్యక్తి గురించి తెలిసినవారు 9440796217, 944079266 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ బ్రహ్మం కోరారు.

'ప్రత్యేక' క్రీడాపోటీల్లో నకరికల్లు విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన నకరికల్లు భవిత స్కూల్‌లోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలు

నకరికల్లు: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు నరసరావుపేటలో నిర్వహించిన క్రీడాపోటీల్లో నకరికల్లు ప్రతిభ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటి జిల్లాస్థాయి బహుమతులు సాధించారు. విభాగాల వారీగా నిర్వహించిన క్రీడాపోటీల్లో జిల్లాస్థాయి రెండో బహుమతిని సాధించారు. చెవిటి, మూగ విభాగంలో సీహెచ్ చంద్రయ్య పరుగుపందెంలో జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతి, బుద్ధి మాంద్యం విభాగంలో బుస్సీ క్రీడలో పి.భాను భాగ్యశ్రీ జిల్లాస్థాయి మూడోబహుమతి, షాట్‌పుట్‌లో బి.శివాని ద్వితీయ బహుమతి, బుస్సీ క్రీడలో రామ్‌చరణ్ ద్వితీయ బహుమతి సాధించారు. విద్యార్థులను ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు జయలక్ష్మి, రమేష్‌లు అభినందించారు.

75 త్యాళూరు విద్యార్థుల ప్రతిభ...

పెదకూరపాడు: నరసరావుపేట, శంకరభారతీపురంలోని జడ్పీ హైస్కూలులో జరిగిన ప్రత్యేక అవసరాలుగల పిల్లల ఆటలో పోటీలలో మండలంలోని 75తాళ్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచినట్లు పాఠశాల హెచ్‌సెం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. జూనియర్ రన్నింగ్‌లో జె.నాగసింధు తృతీయ స్థానం, సీనియర్ రన్నింగ్‌లో కె.పవిత్ర, ఏసమ్మలకు ప్రథమ, ద్వితీయ స్థానాలు వచ్చాయన్నారు. జి.రామకోటిరెడ్డి, లక్ష్మారెడ్డిలకు కన్సోలేషన్ బహుమతులు వచ్చినట్లు తెలిపారు. వీరికి తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ సుబ్బారావుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, పీఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గరికపాటి రాజారావుకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

అమరావతి: నటనే తన జీవితంగా కళారూపాల ద్వారా ఎన్నో సామాజిక అంశాలపై ప్రజలను చైతన్య పరిచిన గరికపాటి రాజారావు నేటి కళాకారులకు స్ఫూర్తిదాయకుడని ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన గరికపాటి రాజారావు సంస్మరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మా భూమి కళారూపాల ద్వారా సాయుధ రైతాంగ పోరాటంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను చైతన్య పరిచి వారిలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహోన్నత కళాకారుడు గరికపాటి రాజారావు అన్నారు. ఈసందర్భంగా గరికపాటి రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కార్యకర్తలు జి.రాజు, చిక్కాల ఉదయశేఖర్, నూతలపాటి శరత్‌బాబు, సీహెచ్ హనుమంతరావు, బి.వేదాంతం చంద్రమ్మ అంజనేయులు, రామయ్య, సత్తార్, పానయ్యలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.